క్లుప్తంగా

నేడు కేశవస్వామి కల్యాణ మహోత్సవం


తాళ్లరేవు కేశవపురంలో శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామి

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురం గ్రామంలో శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రభాతసేవ, కుంకుమార్చనలు, గ్రామోత్సవం, సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, అనంతరం స్వామివారి కల్యాణం జరిపించనున్నట్లు చెప్పారు. భక్తులంతా తరలివచ్చి స్వామి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం


విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఏర్పాటుచేసిన చలి వేంద్రం

అమలాపురం టౌన్: జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 330వ ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి సంఘీయులు పూజలు చేసి కాలజ్ఞానం గురించి వివరించారు. ఈ సందర్భంగా గడియారం స్తంభం సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి ప్రజల దాహార్తి తీర్చారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్నయ్యదాసు, జిల్లా అధ్యక్షుడు ర్యాలీ చంద్రశేఖర్, ఆవుపాటి వేణుగోపాల్, జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు తాళాబత్తుల అప్పలాచార్యులు, తాళాబత్తుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఉప్పలగుప్తం: ఓఎన్‌జీసీ సంస్థలో కాంట్రాక్టర్ల దగ్గర వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలంటూ కోనసీమ కాంట్రాక్ట్ వాహనాల డ్రైవర్ కమిటీ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని ఓఎన్‌జీసీ క్షేత్రాల్లో తాము 4వ తరగతి ఉద్యోగులుగా పని చేస్తున్నామని, ఓఎన్‌జీసీలో కాంట్రాక్టర్ ఎవరైనా ప్రతి నెల జీతాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ తదితరాలేవీ తమకు ఇవ్వడం లేదన్నారు. సెలవులు లేకుండా నెలలో 30 రోజులూ తాము విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. నాలుగైదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక అనేక కష్టాలు పడుతున్నామని తెలిపారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినవారిలో డ్రైవర్లు మాదే రాంబాబు, గుంట్రు చిట్టిబాబు, అయితాబత్తుల రమేష్ తదితరులున్నారు.

కోట్లాది మందికి చేరువగా మన్ కీ బాత్ ప్రయాణం

అమలాపురం రూరల్: మార్పును ప్రోత్సహిస్తూ కోట్లాది మందికి చేరువగా మన్ కీ బాత్ ప్రయాణం సాగించి 100వ ఎపిసోడ్‌కు చేరుకుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి ఈశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, దూరి రాజేష్, చిట్టూరి రాజేశ్వరి, కస్తూరి పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న గ్రామ ప్రదక్షిణ


బండార్లంక వీధుల్లో నిర్వహిస్తున్న వెంకన్న గ్రామ ప్రదక్షిణ

అమలాపురం రూరల్: శ్రీనివాస బాల మిత్ర సంఘం చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో బండార్లంక బిళ్లవారి వీధిలో ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. బిళ్ల వారి వీధి నుంచి, వీరభద్రస్వామి ఆలయం, గంగరాజు వీధి, హైస్కూలు సెంటర్, ముదుగులమ్మ ఆలయం వరకూ గజవాహనోత్సవం జరిపారు. పూజల్లో సంఘం అధ్యక్షుడు చింతపట్ల కృష్ణరామ్మోహన్ రావు, అంకం పెదరాజు, అంకం నాగసత్యనారాయణ, బాసిన కల్యాణ్, నల్లా మధు తదితరులు పాల్గొన్నారు.

ఏటికేడు దిగ'జారుడు'

- ఇంటర్ ఫస్టియర్ నలుగురు, సెకండియర్ 28 మంది పాస్
- యానాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఫలితాలివి
- అధ్యాపకుల చిత్తశుద్ధిపై వెల్లువెత్తుతున్న విమర్శలు



యానాం టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల

యానాం: ఒకటా రెండా.. 53 ఏళ్ల చరిత్ర ఉన్న కళాశాలది. ఉచిత విద్య, సువిశాల ప్రాంగణం, శాశ్వత భవనం, అత్యుత్తమ విద్యార్హతలున్న అధ్యాపకులు, సైన్స్ విద్యార్థుల కోసం అధునాతన ల్యాబ్.. ఒక్కటేమిటి కార్పొరేట్‌కు ఏమాత్రం తగ్గకుండా సకల మౌలిక సదుపాయాలూ ఉన్నాయి. లేనిదల్లా చిత్తశుద్ధి మాత్రమే.. అందుకే ఏటా ఉత్తీర్ణతా శాతం పెరగాల్సింది పోయి తగ్గుదల నమోదవుతుంటుంటే తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇక్కడ చదివించాలంటేనే భయపడిపోతున్నారు. ఇదీ యానాం నియోజకవర్గ పరిధిలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల దుస్థితి.

యానాం టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలను 1970లో స్థాపించారు. కళాశాల తొలినాట ఇక్కడ చదువుకున్న వారెందరో దేశవిదేశాల్లో ఉన్నతస్థానాల్లో స్థిరపడ్డారు. ఈ కళాశాలలో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులతో పాటు కంప్యూటర్ సైన్స్, అకౌంట్స్ అండ్ టాక్సెస్ తదితర ఒకేషనల్ కోర్సులు బోధిస్తున్నారు. కళాశాలలో 16 మంది అత్యుత్తమ విద్యార్హతలున్న పర్మినెంట్ అధ్యాపకులు బోధిస్తున్నారు. ఈ కళాశాలకు యూపీఎస్సీ(యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్)నుంచి సిబ్బంది నియామకం జరుగుతుంటుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులైన వీరికి ప్రతినెలా లక్షల్లో జీతాలు ఇస్తున్నారు. అంతేకాదు మౌలిక సదుపాయాల కోసం సైతం కోట్ల రూపాయల్ని ఖర్చు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రభుత్వ కళాశాల కావడంతో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఇక్కడే చదువుకుంటుంటారు. ముఖ్యంగా శివారు గ్రామాలతో పాటు తీరప్రాంత గ్రామాల విద్యార్థులు ఇక్కడే చదువుతున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అన్ని గ్రూపులు కలిపి 65 మంది పరీక్షకు హాజరుకాగా కేవలం నలుగురు మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం 86 మంది పరీక్ష రాయగా 28 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు.

> **విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం**
>
> కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు పెడుతున్నాం. ఇంటి వద్ద తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది. పిల్లల హాజరు కూడా తక్కువగా ఉంటుంది. కళాశాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.
>
> – వి.చిత్ర, వైస్ ప్రిన్సిపాల్, ఎస్‌టీపీపీ జూనియర్ కళాశాల

పర్యవేక్షణ లేమితో పడిపోతున్న ఫలితాలు

2016 నుంచి కళాశాలలో ఇంటర్ ఉత్తీర్ణతా శాతం దిగజారుతోంది. 2016–17 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరం 27.3 శాతం, ద్వితీయ సంవత్సరం 35.57 శాతం, 2017–18లో ప్రథమ సంవత్సరం 21.2 శాతం, రెండో ఏడాది 46 శాతం, 2018–19 సంవత్సరంలో ప్రథమ సంవత్సరం 22.71 శాతం, ద్వితీయ సంవత్సరం 47.81 శాతం ఉత్తీర్ణత కాగా, 2019–20లో కేవలం 26 శాతం మాత్రమే ఉత్తీర్ణత పొందారు. 2020–21లో ఫస్టియర్ 23 శాతం, సెకండ్ ఇయర్ 21 శాతం, 2022–23లో ఫస్టియర్ 6 శాతం, సెకండ్ ఇయర్ 32 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఆర్ట్స్ సబ్జెక్టులైన సివిక్స్ వంటి సబ్జెక్టుల్లో సైతం కొందరు విద్యార్థులకు 2, 3 మార్కులు వస్తుండటంతో అధ్యాపకుల బోధన స్థాయిపై పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో అధ్యాపకుల పర్యవేక్షణ లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అంతేకాదు అధ్యాపకులు ప్రణాళికాబద్ధంగా బోధించడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఫలితాల్ని విశ్లేషించి విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టేలా అధ్యాపకులు కృషి చేయాల్సిన అవసరం సైతం ఉందని స్థానికులు కోరుతున్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా అడుగులు వేయాలంటే యువత విద్యను అభ్యసించడం ఒక్కటే మార్గమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బెండమూర్లంక పాలగుంట చెరువు వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి మంత్రి విశ్వరూప్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత రాజ్యాంగ రచన ద్వారా నిమ్న కులాలకు రిజర్వేషన్లు అందించిన ఘనత అంబేడ్కర్‌దని మంత్రి చెప్పారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, సర్పంచ్ బర్రే సీతారత్నం, నాతి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, యాళ్ల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

దళిత, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

అమలాపురం రూరల్: దళిత బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ చరిత్రలో నిలిచిపోతారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. జనుపల్లి మన్నాకాలనీలో ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు నిర్వహించారు. మంత్రి విశ్వరూప్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మెండి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆలయం ఆధ్యాత్మిక శోభితం కావాలి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్


ఆలయ నూతన చైర్మన్ ధర్మారావును సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ఆలయ ధర్మకర్తలుగా బాధ్యతలు చేపడుతున్న వారంతా ఆయా ఆలయాల్ని ఆధ్యాత్మిక శోభితంగా మార్చాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పిలుపునిచ్చారు. అమలాపురం కృష్ణేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి నూతనంగా ఎంపికైన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ సభకు మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేవస్థానంలో ఆదివారం జరిగిన ఈ సభకు మంత్రి విశ్వరూప్‌తో పాటు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పాల్గొని నూతన ధర్మకర్తల మండలిచే ప్రమాణ స్వీకారం చేయించారు. దేవస్థానం చైర్మన్‌గా దొమ్మేటి ధర్మారావుతో పాటు ఆరుగురు ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన ధర్మకర్తలను మంత్రి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు వాసర్ల లక్ష్మి, గొవ్వాల రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతతో లయన్స్ సేవలు


నూతన జిల్లా గవర్నర్ సూర్యనారాయణను సత్కరిస్తున్న బాదం బాలకృష్ణ

తాళ్లరేవు: లయన్స్ క్లబ్ సేవలను మరింత బాధ్యతతో ముందుకు తీసుకువెళతామని నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నూతన గవర్నర్ కర్టెన్ రైజర్ కార్యక్రమం గవర్నర్ రిప్రజెంటేటివ్ నడింపల్లి వినోద్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా సూర్యనారాయణను సత్కరించారు. ప్రస్తుత గవర్నర్ మాటూరి మంగతాయారు, పూర్వపు గవర్నర్‌లు శుభాకాంక్షలు తెలియజేసి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు బాదం బాలకృష్ణ, ముంజులూరి విశ్వేశ్వరరావు, బీవీఎస్ రెడ్డి, ఈవీవీ ఈశ్వర్‌కుమార్, వజ్రపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం


ఏఎంసీ డైరెక్టర్‌లను సత్కరిస్తున్న చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: రైతులకు పంట రవాణా, నిల్వ వంటి మెరుగైన సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా నూతన ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పనిచేస్తుందని చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తెలిపారు. ఆదివారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలోని ఆయన స్వగృహంలో మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు, డైరెక్టర్‌లు కమిడి ప్రవీణ్‌కుమార్, సంగాని వీరనాగేశ్వరమ్మ, ముసునూరి శ్రీలత, సవరపు లోవలక్ష్మి, ముదునూరి వెంకటేశ్వరరాజు, మందపాటి మహాలక్ష్మి, కాజా అరుణ తదితరులను శివన్నారాయణ దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సహకారంతో తాళ్లరేవు, ఐ.పోలవరం మండలాల్లో మార్కెట్ యార్డ్‌ల నిర్మాణం, రైతులకు రవాణా సౌకర్యం కోసం లింకు రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బసవా రామలక్ష్మణరావు, సక్కా మరియా, వరసాల రమాదేవి, టి.ప్రభాకరరావు, చింతలపూడి చిట్టిబాబు, రమణాతి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలి


మొబైల్ టాయిలెట్లను పరిశీలిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యానాంలో పలు పర్యాటక స్థలాలను చూసేందుకు వస్తున్న పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆర్ ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ బీచ్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పర్యాటకులకు ఉపకరించే మొబైల్ టాయిలెట్ తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయో స్వయంగా చూశారు. మొబైల్ టాయిలెట్ నిత్యం తాళం వేసి ఉంటుందని తెరిచి ఉంచాలని పలువురు పర్యాటకులు ఆయనను అడిగారు. బీచ్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్ పాల్గొన్నారు.

ముంగిట్లోకి అధునాతన వైద్య సేవలు

- అమలాపురం ఏరియా ఆసుపత్రిలో అందుబాటులోకి డైస్ సెంటర్
- రూ.1.10 కోట్లతో రెండో అర్బన్ హెల్త్ సెంటర్ భవనం


అమలాపురం 27వ వార్డులో నిర్మితమవుతున్న రెండో అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో అధునాతన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లా ప్రభుత్వ పెద్దాసుపత్రి అయిన అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఇటీవల రూ.1.06 కోట్లతో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డైస్) అందుబాటులోకి వచ్చింది. నవజాత శిశువుల్లో వినికిడి, దృష్టి, గుండె, మెదడు, ఉదరం, ఎముకలు తదితర విభాగాల్లో లోపాలను ప్రాథమికంగా గుర్తించి అందుకు అత్యవసర వైద్యం అందించేలా ఈ డైస్ సెంటరును నెలకొల్పారు. అలాగే పెరిగిన వైద్య అవసరాలకు తగ్గట్టుగా అమలాపురం 18వ వార్డులో ఇప్పటికే ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్(యూహెచ్‌సీ)కి అదనంగా మరో సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

పట్టణంలో ప్రస్తుతం పరాయి పంచన ఉన్న ఈ రెండో యూహెచ్‌సీకి రూ.1.10 కోట్లతో సొంత భవనాన్ని నిర్మిస్తున్నారు. స్థానిక 27వ వార్డులో చేపట్టిన భవన నిర్మాణం పనులు ఇప్పటికే 85 శాతం పూర్తయ్యాయి. అలాగే మున్సిపాలిటీ పర్యవేక్షణలో నడిచే మాతా శిశు వైద్యాలయం స్థానిక గరిగుంట చెరువు వద్ద మున్సిపాలిటీ సొంత భవనంలో నిర్వహిస్తోంది. గత కోవిడ్ సమయం నుంచి ఈ వైద్యాలయంలో మున్సిపాలిటీ వైద్య మౌలిక సదుపాయాలను మరింత పెంచింది. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, మున్సిపాలిటీ ఆస్పత్రుల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, వైద్య సేవల్ని క్రమంగా మెరుగు పరుస్తుంది.

> **కొత్త భవనం పూర్తవుతోంది**
>
> 
>
> రెండో అర్బన్ హెల్త్ సెంటర్ కోసం నిర్మిస్తున్న కొత్త భవనం పనులు పూర్తవుతున్నాయి. త్వరలోనే ఈ కొత్త భవనం ద్వారా వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. పట్టణంలోని రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా మున్సిపాలిటీలోని 30 వార్డుల ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తాం.
>
> – ఎం.దుర్గారావు దొర, డీఎంఅండ్‌హెచ్‌వో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

> **85 శాతం పనులు పూర్తి**
>
> 
>
> మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్మితమవుతున్న రెండో అర్బన్ హెల్త్ సెంటరు భవనం నిర్మాణ పనులు 85 శాతం పూర్తి చేశాం. మిగిలిన 15 శాతం పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. మొత్తంగా రూ.1.10 కోట్లతో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నాం.
>
> – కొత్త అప్పలరాజు, డీఈఈ, అమలాపురం మున్సిపాలిటీ

విఘ్నేశ్వరుని సన్నిధిలో న్యాయమూర్తి


విఘ్నేశ్వరుని సన్నిధిలో జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి వి.గౌరీశంకర్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గౌరీశంకర్‌కు ఆలయ అర్చకులు సత్తిబాబు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఇటీవలే ఆయన అమలాపురం కోర్టులో నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని స్వామిని దర్శించి పూజలు చేశానన్నారు. వేదపండితు వేదాశ్వీరాదం పలికారు. స్వామివారి ఆలయ చరిత్రను వివరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట కోర్టు సూపరింటెండెట్ ఉమామహేశ్వరరావు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని చింతలమోరి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వైద్యుడు రాపాక రమేష్‌బాబు వైద్య పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు అందించారు. పార్టీ రాష్ట్ర నాయకులు పితాని బాలకృష్ణ, మల్లిపూడి సత్తిబాబు, గుండుబోగుల పెదకాపు, రాము పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని భీమనపల్లి 11 కేవీ ఫీడర్ లైన్‌లో తీగలను ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మల కత్తిరింపు, లైను మరమ్మతుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ ఎం.రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి, నంగవరం, సూదాపాలెం, విలసవిల్లి, భట్టుపాలెం, సింగరాయిపాలెం గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

ఘనంగా మహాకవి శ్రీశ్రీ జయంతి

తాళ్లరేవు: మహాకవి శ్రీశ్రీ జయంతిని ఆదివారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎలిపే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ రాసిన విప్లవ గీతాలను పలువురు ఆలపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సలాది సత్తిబాబు, అత్తిలి బాబూరావు, పెయ్యల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట సొమ్ముల బకాయిల కోసం...

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి గతంలో పలు వేలం పాటల ద్వారా రావాల్సిన సొమ్ములు బకాయిలు పడిపోవడంతో వాటి వసూళ్లకు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, సిబ్బంది ఆదివారం బకాయిదారుల ఇళ్లకు వెళ్లి మరీ అడిగారు. ఆలయానికి పాటల బకాయిల సొమ్ములు రూ.లక్షల్లో పేరుకుపోవడంతో వారు క్షేత్ర స్థాయి బాట పట్టారు. బకాయిలు చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని పాటదారులను అభ్యర్థించారు.

వసంతకుమార్‌కు మాజీ ఐఏఎస్ అధికారి నివాళి

అమలాపురం రూరల్: ఇటీవల మృతి చెందిన వన్నె చింతలపూడికి చెందిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పచ్చిమాల వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులను మాజీ ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా వసంతకుమార్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

నేటి నుంచి కురంగేశ్వరుని కల్యాణ మహోత్సవాలు


బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి

తాళ్లరేవు: పాతకోరంగిలో ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ శ్రీరాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ స్వామివారి కల్యాణం, 3న సదస్య మహదాశీర్వచనం, 5న త్రిశూలస్నానం, తెప్పోత్సవం, 6న పుష్పయోగోత్సవం నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకోవాలని కోరారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని పరంపేట గ్రామంలో అంబేడ్కర్ 132వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణసంచా కాల్పుల మధ్య అంబేడ్కర్ చైతన్య ర్యాలీని యానాం పురవీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద మెల్లం సంపతరావు, పోతుల శివకృష్ణ, ప్రముఖ న్యాయవాది కమిడి విజయకుమార్, అధ్యాపకుడు డాక్టర్ ప్రసాద్, గెద్దం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లరేవు: ఆంధ్రా–యానాం సరిహద్దు ప్రాంతమైన నేరేళ్లంక వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వల్లు ప్రవీణ్(29) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన వల్లు ప్రవీణ్ తన స్నేహితుడు నూకరాజుతో కలిసి బైక్‌పై యానాం వెళ్లి తిరిగి గాడిమొగ వెళుతుండగా నేరేళ్లంక కోళ్లఫారం సమీపంలో ఎదురుగా వస్తున్న మరొక బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ముమ్మిడివరం: అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై కేసు నమోదుచేసినట్లుగా ఎస్‌ఐ కె.సురేష్‌బాబు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం ముమ్మిడివరం మండలం అయినాపురం గ్రామానికి చిటికెన వరలక్ష్మి, ఆమె మేనమామ చిటికెన త్రినాథ్ రామశంకర్‌లకు 2012లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నంగా మూడు కుంచాల పొలం, నాలుగు కాసుల బంగారం, రూ.75 వేలు నగదు, రూ.లక్ష సారి సామానులు ఇచ్చారు. అయితే తన భర్త మద్యానికి బానిసై పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురమ్మంటూ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.